క్లుప్తంగా

ఈజీఎస్ టీఏ ఆత్మహత్య


సంపత్ (ఫైల్)

కమలాపూర్: కమలాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కరీంనగర్ జిల్లా వీణవంక మండలం శ్రీరాములపేటకు చెందిన కోలా సంపత్ (28) గురువారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపారు. కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని మడిపల్లి కెనాల్ వద్ద గల ట్రాక్ వద్ద సంతోష్ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

దాడి కేసులో అన్నదమ్ములకు రెండేళ్ల జైలు

పరకాల : భూమి విషయంలో సోదరుడిపై దాడి చేసిన అన్నదమ్ములకు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ పరకాల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం 2015లో నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన దద్దు సమ్మయ్య, రాజయ్య, సాంబయ్య సోదరులు. ఈ క్రమంలో భూమి విషయంలో సమ్మయ్యపై రాజయ్య, సాంబయ్య దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సమ్మయ్యకు తీవ్రగాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ వెంకటరత్నం ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టిన అనంతరం కానిస్టేబుల్ సిలువేరు బాబు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన జడ్జి.. దాడి ఘటన వాస్తవమని రుజువుకావడంతో నిందితులకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


రమ (ఫైల్)

కమలాపూర్: మండలంలోని మర్రిపల్లిగూడేనికి చెందిన సదువాల రమ (45) వ్యవసాయ బావిలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిన రమ ఎంతకూ రాకపోవడంతో ఆమె భర్త స్వామి వెతుకుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద రమ చెప్పులు, చెద్దరు కనిపించాయి. కానీ రమ మాత్రం కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలికి చేరుకుని వ్యవసాయ బావిలోని నీటిని మోటార్ల ద్వారా తోడగా రమ బావిలో మృతి చెంది కనిపించింది. తమ చెల్లి రమ మృతికి తన బావ స్వామి, అల్లుడు సురేష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి సోదరుడు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం బాగిర్తిపేటకు చెందిన బోమిక సొందరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేలం ద్వారా రూ.1,74,930 ఆదాయం

పరకాల: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 18 వాహనాలకు వేలం పాట వేయగా రూ.లక్ష74,930 ఆదాయం వచ్చినట్లు పరకాల ఎక్సైజ్‌శాఖ సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. డీపీఈఓ లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో గురువారం వేలం పాట నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.88,700కు గాను రూ.లక్ష74,930 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, రవీందర్, సమ్మయ్య, శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

వేలేరు : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని మల్లికుదుర్ల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కావ్య, సాయిచరణ్, మణికంఠ ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.జయసాగర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో ఎస్‌డీఎల్‌సీఈ కేయూ గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ 14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 16, 17, 18 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీఈటీ సుమలత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

15న కమిటీల ఏర్పాటు

ఐనవోలు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంవైఎస్ అనుబంధ సంఘాల నూతన కమిటీలను ఈనెల 15వ తేదీన ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎస్పీ హనుమకొండ జిల్లా కార్యదర్శి బొక్కల నారాయణ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ చివరి ఘట్టంలో ఉన్నందున జాతిని అన్ని గ్రామాల్లో చైతన్య పరిచేందుకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.


పరకాల : ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


ఎల్కతుర్తి : ముల్కనూర్ బాలికల పాఠశాలలో..


ఐనవోలు : ముగ్గుల వేస్తున్న విద్యార్థినులు


వేలేరు : ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

- పతంగులు ఎగురవేసిన విద్యార్థులు
- భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో మారుమోగిన స్కూళ్లు
- రంగులు అద్ది గొబ్బెమ్మలు పెట్టిన మహిళా టీచర్లు, విద్యార్థినులు

ఎల్కతుర్తి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను బాల్యం నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు జ్యోతిజవహర్, సుకన్య, అనురాధ, అరుణ, శ్యామల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రగతిసింగారంలోని సన్‌రైజ్ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో నాలుగో తరగతి విద్యార్థి మానస ప్రథమ బహుమతి సాధించింది. నాలుగో తరగతి విద్యార్థిని శరణ్య ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిరుపతి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని ఏకశిలా విద్యాసంస్థల అధినేత తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రం శివారులోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచారు. విద్యార్థులు పతంగులు ఎగరవేసి ఉత్సాహంగా గడిపారు. హరిదాసుల వేశాధారణలో పలువురు విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. పండగలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. సంక్రాంతి పండగను ప్రతిఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంలోని కేరళ మోడల్ స్కూల్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులు, హరిదాసు, గోదాదేవి వేషధారణలతో హరిదాసు కీర్తనలు ఆలపించారు. పలువురు విద్యార్థిలు సంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతిని ప్రతిభంబిస్తు అందమైన రంగవల్లులు అలంకరించి గొబ్బెమ్మలు పెట్టారు. అనంతరం విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, కైట్ ఫెస్టివల్స్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కేరళ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తూముల దేవేందర్‌రావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పరకాల : భోగిమంటలతో సందడి చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని పున్నేలు, ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పున్నేలులో పుల్లూరి శాన్వి మొదటి బహుమతి, ఎండీ సదాపు ద్వితీయ బహుమతి, కాసు జోష్న తృతీయ బహుమతి, జిల్లా రాంచరణ్ కన్సోలేషన్ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్ తెలిపారు. ఉడుతగూడెంలో ఏ.బేబి మొదటి బహుమతి, వై.నవ్యశ్రీ ద్వితీయ బహుమతి, టీ.కావేరి తృతీయ బహుమతి గెలుపొందినట్లు హెచ్‌ఎం చుంచుకాల లింగారావు తెలిపారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి అలరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు రాధిక, సౌందర్య, వీరయ్య, తబిత, దయాకర్, ప్రేమ్‌చంద్, కుమారస్వామి పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వాతావరణంతో పాటు గ్రామీణ నేపథ్యాన్ని తలపించేలా పాఠశాల ప్రాంగణమంతా రంగురంగు ముగ్గులు వేశారు. గంగిరెద్దు, హరిదాసు కీర్తనలు ఆలపించి గాలిపటాలు ఎగురవేశారు. పాఠశాల విద్యార్థులు నృత్యప్రదర్శనలతో ఆకట్టుకోగా భోగిపళ్లు పోసి భోగిమంటలు వేసి పరమాన్నం వంట చేశారు. బిట్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జోసఫ్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కమలాపూర్ : నృత్యం చేస్తున్న విద్యార్థినులు


శాయంపేట : ముగ్గులు వేస్తున్న చిన్నారులు


పరకాల : పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు


కమలాపూర్ : వివిధ వేషధారణలో చిన్నారులు

మంత్రి సురేఖకు సన్మానం


మంత్రి సురేఖతో అక్కంపేట గ్రామస్తులు

ఆత్మకూరు : అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను గురువారం అక్కంపేట గ్రామస్తులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శంకరభక్తుల సత్యం, సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను సురేఖకు వివరించారు. అక్కంపేటలో జయశంకర్ స్మారక భవనాన్ని నిర్మించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీరబ్రహ్మం, సుమన్, బోగోజు భద్రయ్య, రాంమూర్తి, విజయ్, మధు, రాంమూర్తి, నరేందర్, పద్మావతి, రాగమయి, ఓదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

దామెర : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఊరుగొండ సమీపంలోని 163 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధారం గ్రామానికి చెందిన మునికుంట్ల వేణు తన కుమార్తెను హనుమకొండలోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి తీసుకొస్తున్నాడు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్ తన ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని ఊరుగొండ వద్దకు రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో వెంకటేశ్, మునికుంట్ల వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సయ్యద్ సమీనా జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అల్లం మాధవి గురువారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్రస్థాయి అండర్ 17 బాల, బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో సమీనా ఆటోమెంట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని సుజాల్పూర్ పట్టణంలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మకూరు ఏపీఓ రాజిరెడ్డి, పీఈటీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కమలాపూర్ : ఆరె కులస్తుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా ముఖ్య సలహాదారుడు పేర్వాల లింగమూర్తి అన్నారు. హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్లను మండలంలోని 13 గ్రామాల్లోని ఆరె కులస్తులకు పంపిణీ చేశారు. ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికేట్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర నాయకుల కృషితో ఓబీసీ సమస్య తుది అంకానికి చేరిందన్నారు. ఓబీసీ సర్టిఫికెట్ మంజూరు అయ్యేంత వరకు ఐఐటీ, నిట్, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ విద్యా సంస్థల ప్రవేశాలకు, జాతీయస్థాయి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్థానిక తహసీల్దార్ నుంచి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. మండల అధ్యక్షుడు కదం రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరావు, జిల్లా నాయకులు కండేరావు, సుధాకర్, భాస్కర్, శ్రీనివాస్, చందర్‌రావు, నరహరి, రామారావు, రాజు, వీరేశం, ఆనందరావు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

కామ్రేడ్ వీరన్న సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న రాజమౌళి

ఆత్మకూరు : శ్రామికుల పక్షాన పోరాటం చేసిన సీపీయూఎస్ఐ వ్యవస్థాపక కార్యదర్శి కామ్రేడ్ వీరన్న సేవలు మరువలేనివని దళిత, బహుజన కూలీ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పిట్టల రాజమౌళి అన్నారు. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, నీరుకుళ్ల గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజమౌళి మాట్లాడుతూ.. దళిత, బహుజనుడు శ్రామికుల పక్షాన పోరాటం చేసిన వీరన్నను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రమను నమ్ముకొని జీవిస్తున్న శ్రామికుల పక్షాన పోరాటం చేసి హక్కులను కాపాడిన గొప్ప యోధుడు కామ్రేడ్ వీరన్న అని కొనియాడారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు సత్యనారాయణ, నాయకులు కోటి, కిరణ్‌చారి, సంతోష్, రవి పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


చిన్నారులతో పాఠశాల ఉపాధ్యాయులు

కమలాపూర్ : జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రంగనాథ్, ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం

ధర్మసాగర్ : కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌గా ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర గురువారం తెలిపారు. అదే విధంగా నారాయణగిరి గ్రామ ఇన్‌చార్జ్‌గా ఏడుదొడ్ల తిరుమల్‌రెడ్డి, ముప్పారం, శ్యామల మహేందర్‌రెడ్డి, ధర్మసాగర్, గుర్రపు ప్రసాద్, దేవునూర్, సోమదేవరపల్లి, కాశగూడెం ఇన్‌చార్జ్‌గా మహ్మద్ పాషా, మల్లక్‌పల్లి, ధర్మపురం, తాటికాయల, రాయిగూడెనికి మంద ఆరోగ్యం, ఉనికిచర్ల, రాంపూర్ ఇన్‌చార్జ్‌గా రాజు, సాయిపేట, క్యాతంపల్లి, బంజర్‌పల్లి, జానకిపురం, కేశవనగర్‌కు ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి, పెద్దపెండ్యాల, కొత్తపల్లికి భిక్షపతి, రాపాకపల్లి, ఎల్కుర్తికి వక్కల రవిను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు.

22 నుంచి స్కిల్ అప్‌గ్రేడేషన్‌కు ఉచిత శిక్షణ

పరకాల: ఈ నెల 22వ తేదీ నుంచి నేషనల్ అకాడమిఆఫ్‌కన్‌స్ట్రక్షన్‌లో లేబర్ కార్డు ఉన్న యువతి, యువకులకు (18–45 సంవత్సరాలు) స్కిల్ అప్‌గ్రేడేషన్‌కు 15 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి.అశోక్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణకాలంలో రోజుకు రూ.300 స్టయిఫండ్ లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మేసనరీ, పేయింటర్ ట్రేడుల్లో 15 రోజుల శిక్షణ ఇచ్చి న్యాక్ ద్వారా స్కిల్ సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకాలంలో యూనిఫాం, స్టేషనరీ ఐటమ్స్, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. 9581483526, 7893376683 ఫోన్ నెంబర్‌లకు సంప్రదించాలని ఆయన కోరారు.

ఉమాదేవికి అవార్డు అందజేత

ఐనవోలు : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా శాఖవారు మండలంలోని ఉడుతగూడెం పాఠశాలకు చెందిన ప్రతికంఠం ఉమాదేవికి జిల్లా స్థాయి అవార్డు అందించారు. కాగా గురువారం పాఠశాలలో హెచ్‌ఎం చుంచుకాల లింగారావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు బరిగల రమేష్, అంగన్‌వాడీ టీచర్ రాధిక, ఆకులపెల్లి రవి, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

'ఇనగాల'కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వెంకట్రామ్‌రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. ట్రస్టు ద్వారా పేద ప్రజలకు సేవా చేశారని, వెంకట్రామ్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆలోచించి ఇనుగాలకు ఎమ్మెల్సీ ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు.

ఇగ్నైట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శాయంపేట : ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని జగదిగిరి గుట్టలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రసాయి ఇగ్నైట్ ఉపన్యాసం, చర్చగోష్ఠి, చిత్రలేఖనం, నృత్య, స్పెల్‌బీ, క్విజ్, నాటికలు, కథల పోటీల్లో మండల కేంద్రంలోని సంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హిందీ సీనియర్ ఉపన్యాస పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎండీ సమీరా, తెలుగు జూనియర్ కథల విభాగంలో ఏడోతరగతి విద్యార్థిని ఎమ్.అనూష, క్విజ్ పోటీల్లో ఎనిమిదోతరగతి విద్యార్థిని జె.అక్షిత, యూత్ పార్లమెంటులో తొమ్మిదో తరగతి విద్యార్థిని సహస్ర పాల్గొన్నారు. కాగా క్విజ్‌లో అక్షిత తృతీయ బహుమతి సాధించగా గురుకులాల సెక్రటరీ నవీన్ నికోలస్ రూ.5వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి, ఉపాధ్యాయులు అక్షితను అభినందించి ప్రశంసపత్రం అందించారు. చదువుతో పాటు వివిధ రంగాల్లో విద్యార్థులు రాణించాలని, ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పథకాలు అందించేందుకే 'సంకల్ప్‌యాత్ర'


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : కేంద్ర ప్రభుత్వ పథకాలను అట్టడుగు ప్రజలకు అందించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గుండె విజయరామారావు అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత సంకల్ప్‌యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాల్‌పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రజా సంక్షేమ పథకాలను అట్టడుగు ప్రజలకు అందిచేందుకే దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వివిధ విభాగాల 18 స్టాళ్లను ఏర్పాటు చేసి దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ, స్థానిక సంస్థల మీదుగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ జి.రమేష్, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, నాయకులు కాచం గురుప్రసాద్, కందకట్ల సత్యనారాయణ, దేవునూరి మేఘనాథ్, ఆర్పీ జయంత్‌లాల్, మార్త భిక్షపతి, బెజ్జంకి పూర్ణచారి, పిట్ట వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహ ఆలయంలో 'కుడారై' ఉత్సవం


పాయసం సమర్పిస్తున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజు గురువారం 'కూడారై' ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నిత్య పూజల అనంతరం ధనుర్మాస సేవాకాలాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛమైన దేశి ఆవు పాలతో పాయసం చేసి 108 గంగాళాలలో స్వామి వారికి నివేదించి 'కుడారై వెల్లుమ్ శీర్ గోవిందా' అనే పాశురాన్ని పాడి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రవి ఆచార్యులు మాట్లాడుతూ.. ధనుర్మాసంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజుగా వివరించారు. ధనుర్మాస వ్రతం ఆచరించిన ఆండాళ్ అమ్మవారు స్వామి వారిలో ఐక్యమైతే పాలతో చేసిన పాయసాన్ని 108 గంగాళాలలో సమర్పిస్తానని మొక్కుకున్నట్లు చెప్పారు. ఆలయ అర్చకుడు జయకృష్ణ, శేషు, ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, డైరక్టర్ కాటబోయిన కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తూర్పాటి సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు తమ నివేదికతో సమావేశానికి సకాలంలో హాజరై మండల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.